సాక్షి శ్రీకాకుళం

న్యూస్‌రీల్

21 నుంచి ట్రిపుల్ ఐటీకి సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్‌: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం క్యాంపస్‌కు ఈ నెల 21 నుంచి 29 వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు ప్రకటించారు. ఈ మేరకు ఎస్ఎంపురం క్యాంపస్‌లో వివరాలు వెల్లడించారు. 30న తరగతులు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ల తుది జాబితా విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ఏపీపీఎస్సీ ద్వారా జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు విడుదల చేసిన నోటిఫికేషన్ నెం.23/2021లో భాగంగా ప్రొఫిషియన్సీ టెస్టు ఆధారంగా మెరిట్ జాబితాను అందుబాటులో ఉంచినట్లు డీఆర్‌ఓ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదలైంది. శ్రీకాకుళం.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌తో పాటు కలెక్టర్ కార్యాలయంలో నోటీసు బోర్డులో ఫలితాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

చార్జిషీట్లు త్వరగా ఫైల్ చేయాలి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జైల్లో ఉన్న ముద్దాయిల కేసుల్లో పోలీసులు చార్జిషీట్లు త్వరగా ఫైల్ చేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అండర్ ట్రయల్ ప్రిజనర్స్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తులు భాస్కరరావు, పవన్‌కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, డీఆర్‌ఓ గణపతి, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ నవి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నెహ్రూ యువకేంద్రం(ఎన్‌వైకే) ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. హెల్త్‌కేర్ సంస్థలో క్రిటికల్ కేర్‌నర్స్, హోంకేర్ నర్స్, నర్సింగ్ అసిస్టెంట్ పోస్టులకు, మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. హెల్త్‌కేర్‌కు 19 నుంచి 30 ఏళ్ల వయసు, బీఎస్సీ నర్సింగ్/ బీఎస్ఎం /ఏఎన్ఎం/ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఫైనాన్స్ కంపెనీకి 18 నుంచి 28 ఏళ్ల వయస్సు కలిగి, డిగ్రీ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు నెహ్రూ యువ కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు.

సామాజిక న్యాయ యాత్ర

సంక్షేమ పాలన వివరించేందుకే..

- ఇచ్ఛాపురంలో ఈ నెల 26న ప్రారంభం
- దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన
- కోటీ 15 లక్షల మందికి సంక్షేమ పథకాల లబ్ధి
- మరో 4 నెలల్లో ఎన్నికలు ఎదుర్కోబోతున్నాం
- సన్నాహక సమావేశంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, పిరియా సాయిరాజ్ తదితరులు

కంచిలి: దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ, అభివృద్ధి పాలన ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సాగుతోందని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. కంచిలి మండల కేంద్రంలో బుధవారం ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సామాజిక న్యాయయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పాలన ఎక్కడా ఆగకుండా కొనసాగించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కోటీ 80లక్షల మంది బలహీనవర్గాల గృహస్తులు ఉంటే అందులో కోటీ 15 లక్షల మందికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. ఇంత సమర్థంగా పరిపాలన సాగిస్తుంటే ప్రతిపక్షాలు, చంద్రబాబునాయుడు, దత్తపుత్రుడు దుష్ప్రచారం చేస్తున్నారని, దాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మరో నాలుగు నెలల్లో ఎన్నికలను ఎదుర్కోబోతున్నామన్నారు. సంక్షేమ పాలనను వివరించడంతో పాటు రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు జరిగిన టీడీపీ రాక్షస పాలన మళ్లీ రాకుండా 175 నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలనే ఉద్దేశంతో ఈ నెల 26 నుంచి ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా ప్రాంతాల నుంచి సామాజిక న్యాయయాత్రలను ప్రారంభించాలని సీఎం సంకల్పించారని వివరించారు. దీని ప్రకారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొదటిగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచే యాత్రను చేపట్టమని సీఎం సూచించారని సుబ్బారెడ్డి వెల్లడించారు. యాత్రను పెద్ద ఎత్తున విజయవంతం చేయడం ద్వారా రానున్న ఎన్నికల్లో ఇచ్ఛాపురం గెలుపునకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఇందుకు నేతలంతా ఐక్యంగా పనిచేయాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అన్ని పదవుల్లో 70 శాతం మందిని నియమించామని, ఈ విషయాలను 175 నియోజకవర్గాల్లో ప్రజలకు తెలిపేందుకే న్యాయ యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే జగనన్న ఆరోగ్య సురక్ష 20 రోజులుగా జరుగుతోందని, ప్రజలందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సామాజిక బస్సుయాత్ర ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, బస్సుయాత్ర ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, తడక యశోద పాల్గొన్నారు.

98 శాతం హామీలు అమలు చేశాం



ఎన్నికల హామీల్లో 98 శాతం అమలు చేశాం. ఈ నెల 26 నుంచి మొదలయ్యే సామాజిక న్యాయయాత్రలో ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తాం. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం, అల్లూరిసీతారామరాజు జిల్లాల్లో ఉన్న 34 నియోజకవర్గాల్లో బస్సుయాత్ర జరుగుతుంది. మొదటిగా ఇచ్ఛాపురం నుంచే యాత్రను ప్రారంభించడానికి నిర్ణయించాం. ఈ క్రమంలో ఈ నెల 26 ఇచ్ఛాపురం మెయిన్‌రోడ్డు బస్టాండ్ వద్ద జరిగే సామాజిక న్యాయయాత్ర సభను విజయవంతం చేయాలి. జగన్ నాయకత్వాన్ని బలపర్చడానికి అందరూ కలిసికట్టుగా కృషిచేయాలి. టీడీపీ పాలనలో గజదొంగల్లా దోచుకుతిన్నారు. ప్రతిసారి చంద్రబాబు జిమ్మిక్కులు, టక్కుటమార విద్యలతో బయటపడే వారు. ఈసారి జగన్ ప్రభుత్వంలో అది కుదరలేదు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నా ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు, టీవీ చానెళ్లు అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. వీటిని తిప్పికొట్టాలి. – బొత్స సత్యనారాయణ, రీజినల్ కో–ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

ఐక్యంగా పనిచేద్దాం



ఇచ్ఛాపురం నుంచి ఈ నెల 26వ తేదీన ప్రారంభించబోయే సామాజిక న్యాయయాత్రను కలిసికట్టుగా విజయవంతం చేద్దాం. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం.
– పిరియా సాయిరాజ్, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త

కలిసికట్టుగా పనిచేయాలి



ఇచ్ఛాపురంలో కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యం. ఈ నెల 26న ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలి. ఇందుకు ఐక్యంగా కృషిచేయాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఉన్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలి. ప్రతిపక్షాల కుయుక్తుల్ని యాత్ర ద్వారా ప్రజలకు వివరించాలి.
– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే

అన్ని వర్గాలకు న్యాయం



దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ , చక్కని పరిపాలనను ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారు. ఈ విషయాలను ఎలుగెత్తిచాటడానికే బస్సుయాత్రను చేపడుతున్నాం.
– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

సుపరిపాలనకు చిరునామా



రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ సుపరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం. యాత్ర విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలి. – నర్తు రామారావు, ఎమ్మెల్సీ

విజయవంతం చేద్దాం



నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీ, నా మైనార్టీలు అని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ అంటుంటారు. టీడీపీ మాత్రం అందుకు భిన్నం. గతంలో సమస్యల పరిష్కారానికి చంద్రబాబు వద్దకు వెళ్లిన మత్స్యకారులకు తోలుతీస్తానని, టెంట్ తీయకపోతే ఫినిష్ చేస్తానని బెదిరించారు. నాయీబ్రాహ్మణులకు తోకలు కట్‌చేస్తానని, ఇంకోసారి దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని దళితులను అవమానించారు. చంద్రబాబు హయాంలో గిరిజన, మైనార్టీలకు క్యాబినెట్‌లో చోటు కల్పించలేదు. సీఎం జగన్ మాత్రం ఎంతో గౌరవించారు. వీటిని అందరికీ చెప్పేందుకే సామాజిక న్యాయయాత్ర చేపడుతున్నాం.
– డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి

నవరాత్రి వైభవం

మహాలక్ష్మిగా నీలమణిదుర్గ


నీలమణిదుర్గ

పాతపట్నం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు బుధవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

500 కేజీల అన్నంతో అభిషేకం



లలితామహాత్రిపుర సుందరికి అన్నాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: నగర పరిధిలోని తమ్మినాయుడుపేటలో అసిరితల్లి సమేత లలితా త్రిపురసుందరీ దేవి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని బుధవారం అన్నపూర్ణగా అలంకరించారు. అర్చకులు శ్రీపాద సురేష్ బాబు, ధర్మకర్త సాగి శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో 500 కేజీల అన్నంతో అభిషేకం చేశారు.

బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీదేవి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలాత్రిపుర కాలభైరవస్వామి పీఠం దేవాలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా బుధవారం సుమారు రెండు వేల మంది మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకుడు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఉత్సవ వైభవం

కొత్తమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కొత్తమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
– కోటబొమ్మాళి


పూజలు చేస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక దంపతులు


ఆకట్టుకున్న వేషధారణలు

క్లుప్తంగా

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: ఏపీ వైద్యవిధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పలు ఉద్యోగాలను కాంట్రాక్ట్/ ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ విధానంలో ల్యాబ్ టెక్నీషియన్-4 పోస్టులు, ఆడియో మెట్రీషియన్స్-1, ఎలక్ట్రీషియన్-1, ఔట్ సోర్సింగ్‌లో ల్యాబ్ అటెండెంట్- 4 పోస్టులను భర్తీ చేయనున్నారని, ఆసక్తి గల వారు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజర్వేషన్, అర్హతల వివరాలకు శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు.

సహిత విద్య ఆర్పీల ఇంటర్వ్యూలు రేపు


డాక్టర్ రోణంకి జయప్రకాష్

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్య (భవిత) కేంద్రాల్లో రిసోర్స్‌పర్సన్(ఆర్పీ)ల ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూ ప్రక్రియ ఈ నెల 20న జరగనుందని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. సహిత విద్య కేంద్రాల్లో వీఐ/హెచ్ఐ, ఎంఆర్ ఆర్పీ పోస్టులకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 172 మంది దరఖాస్తులు చేసుకోగా సర్టిఫికెట్ల పరిశీలనకు 143 మంది హాజరయ్యారని, వారిలో ఆరుగురిని అనర్హులుగా గుర్తించామన్నారు. 11 మంది అభ్యంతరాల అనంతరం ఫైనల్ మెరిట్ లిస్టును డీఈవో శ్రీకాకుళం వెబ్‌పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాలో ఉన్న అభ్యర్థులకు ఎంఆర్‌కు, వీఐ/హెచ్ఐ కేటగిరిలకు వేర్వేరుగా 1:3 రేషియో ప్రకారం ఇంటర్వ్యూలకు పిలుస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి ఇంటర్వ్యూలు మొదలవుతాయని తెలిపారు. వివరాలకు 94924 20186 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సత్యం మాస్టారు ఆశయసాధనకు కృషి


సంతాపసభలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మందస: ప్రజల బాగు కోసం పోరుబాట పట్టిన కామ్రేడ్ కొల్లి సత్యనారాయణ(సత్యం మాస్టారు) ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సత్యం మాస్టారు సంస్మరణ సభ మందసలో బుధవారం జరిగింది. వివిధ పార్టీలు, సంఘాల ప్రతినిధులు హాజరై నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బి.తులసీదాసు, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.మోహనరావు, మార్పు ట్రస్ట్ అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, స్పందన నాయకులు వడ్డి గోపాలకృష్ణ, తెలుకల గణేష్, సీపీఎం నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, టి.లక్ష్మీనారాయణ, పి.దేవేంద్ర, ఎన్.గణపతి, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటాలి


యోగా క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యతో పాటు క్రీడల్లో సత్తాచాటి జాతీయ స్థాయిలో రాణించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్ఎంపురం క్యాంపస్‌లో బుధవారం జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో భరత్‌సాయి, రజిత, నళిని, విజేయ్, తవిటి నాయుడు, మనోజ్‌తరుణ్, నర్సింగరావు ప్రతిభ కనబరిచారు. వీరు పశ్చిమబెంగాల్‌లో డిసెంబర్ 27, 28 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235


పొట్టదశలో సాగునీరు అందించండి

- జగనన్నకు చెబుదాంలో కలెక్టర్‌కు రైతుల వినతి


కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, రైతులు

గార : వరి పొట్టదశలో ఉందని, సాగునీరందించి పంటను కాపాడేందుకు సహకరించాలని వంశధార కుడి కాలువ, బైరిదేశిగెడ్డ కాలువ ప్రాంత రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం గార మండల కేంద్రంలో 'జగనన్నకు చెబుదాం' పేరిట ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హాజరై వినతులు స్వీకరించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు వరి పంట చివరి దశలో ఉందని, సాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షాలు 40 రోజులుగా కురవలేదని, సాగునీరు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ గొండు రఘురాం, పార్టీ మండలాధ్యక్షుడు పీస గోపి, మార్పు పృథ్వీరాజ్, పీస శ్రీహరిరావు, కొయ్యాన నాగభూషణం, యాళ్ల నారాయణమూర్తి తదితరులు రైతులతో కలిసి కలెక్టర్‌కు సమస్య వివరించారు. ఎత్తిపోతల పథకాలు, పై ప్రాంతంలో గట్లు తొలగించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని వంశధార ఎస్ఈ డోల తిరుమలరావును కలెక్టర్ ఆదేశించారు. కనీసం 10 రోజులు ఏకధాటిగా నీరు ఇవ్వగలిగితే సమస్యను అధిగమించవచ్చన్నారు. తీర ప్రాంతంలో విద్యుత్ వైర్లు పాడయ్యాయని, వాటిని మార్చాలని కోరారు. రీసర్వే తర్వాత 8 వరకు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ రామారావుకు సూచించారు. అనంతరం 70 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్పీ జి.రాధిక, జేసీ ఎం.నవీన్, డీఎస్పీ శృతి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్, ఆర్డీవో బి.శాంతి, డ్వామా పీడీ జి.వి.చిట్టి రాజు, సీపీఓ లక్ష్మీప్రసన్న, హౌసింగ్ పీడీ ఎన్.గణపతి, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఎంపీడీఓ సంజీవ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


అచ్చెన్నా.. అబద్ధాలు కట్టిపెట్టు


మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఇకనైనా అబద్ధాలు కట్టిపెడితే మంచిదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హితవుపలికారు. బుధవారం పోలాకి మండలం తలసముద్రం గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి 160 సీట్లు ఖాయమంటూ అచ్చెన్న ఆశతో వున్నారని, అవి గాలిలో మేడలుగానే మిగిలిపోతాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లోమీడియా ప్రచారాన్నే చిలుకపలుకులుగా చెబుతున్న అచ్చెన్న తీరును ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు రిమాండ్ ఖైదీగా నాలుగు గోడల మధ్య ఉంటే ప్రభుత్వానికి సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఆయన అరెస్ట్ విషయంలో నిజమేంటో అచ్చెన్నాయుడుతో సహా అందరికీ తెలుసున్నారు. సీఐడీ అరెస్టుకు ముందే ఈ కేసులో ఈడీ, జీఎస్టీ, ఆదాయపన్ను శాఖలు విచారణ చేపట్టి అవినీతి జరిగిందని తేల్చిచెప్పారని గుర్తుచేశారు. చంద్రబాబు ఏ తప్పూ చేయలేదని సిగ్గులేకుండా ప్రచారం చేయడాన్ని ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత దేశంలో తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, మడలపార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు తదితరులు వున్నారు.

స్టాంపుల రుసుం పెంపు ఉపసంహరించాలి


శ్రీకాకుళం పాతబస్టాండ్ :



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు

సంక్షేమ స్టాంపుల నిధి రుసుం రూ.20 పెంపుదలను రాష్ట్ర బార్ ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో న్యాయవాదులు ఏకమై ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శ్రీకాకుళం జిల్లా బార్ అసోషియేషన్‌లో జిల్లాలోని వివిధ కోర్టుల పరిధిలో ఉన్న బార్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం న్యాయవాదులకు ఆపద సమయంలో చెల్లిస్తున్న రూ.4 లక్షలను కనీసం రూ.20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తాన్ని పెంచకుండా ఒక్క సంక్షేమ నిధి స్టాంపు రుసుం పెంపు సరికాదన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు వివేకానంద, డి.నర్సింహమూర్తి, కె.విజయలక్ష్మి, టి.సత్యంనాయుడు, రవి, పొన్నాడ రాము, గంగుల భాస్కరరావు, హరిప్రియ, ఎ.లక్ష్మీనారాయణ, భవానీప్రసాద్, బి.ఫల్గుణరావు, వాన కృష్ణచంద్, కూన అన్నంనాయుడు, ననపల హరి పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో ప్రెస్ అకాడమీ చైర్మన్


శిఖర దర్శనం చేసుకుంటున్న కొమ్మినేని శ్రీనివాసరావు


జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని మధుకేశ్వరున్ని బుధవారం రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిఖర దర్శనం అనంతరం అర్చకులు ఆలయ చరిత్రని వివరించి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన విజయ్‌కుమార్

శ్రీకాకుళం క్రైమ్/శ్రీకాకుళం : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) పోర్టికో పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పవ్వల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. నగరంలో రైతు బజారు సమీపంలో నివసిస్తున్న దేగాది జ్యోతి విజయ్‌కుమార్‌కు 2022 సెప్టెంబరులో పలాసకు చెందిన యువతితో వివాహమైంది. విజయ్‌కుమార్ తండ్రి వెంకటరమణ జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ మరణించారు. దీంతో 2010లో కారుణ్య నియామకం కింద విజయ్ కుమార్‌కు జిల్లా జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. విజయ్‌కు పెళ్లికి ముందే మద్యం అలవాటు ఉంది. వివాహమైన రెండు నెలల వరకు దంపతులు బాగానే ఉన్నా మద్యం వ్యసనం కారణంగా గొడవలు మొదలయ్యాయి. మద్యం మానమని భార్య, తల్లి సీతారత్నం నచ్చజెప్పినా విజయ్ వినలేదు. దీంతో విసిగిపోయిన భార్య జనవరిలో కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో మరింత మనోవేదనతో విజయ్ మద్యం అతిగా తాగడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఈ నెల 12న సూపర్‌వాస్మాల్-33 తాగాడు. వెంటనే తల్లి రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించింది. మరుసటి రోజు డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చినా మరళా ఆరోగ్యం బాగాలేకపోవడంతో అదే ఆసుపత్రికి వెళ్లాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం రిమ్స్ ఆసుపత్రి పోర్టికో మీద నుంచి విజయ్ దూకేశాడు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. తల్లి సీతారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఎండ తీవ్రతతో రైతు మృతి


బొంగు సింహాచలం(ఫైల్)

సంతబొమ్మాళి: మూలపేట పంచాయతీ సందిపేటలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పలువురు రైతులు పొలాలకు వంశధార నీరు అందకపోవడంతో మోటార్ల ద్వారా పంటను కాపాడుకోవాలని మంగళవారం సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతు బొంగు సింహాచలం (63) తన పొలం నీరు లేక ఎండిపోతుందని బుధవారం మధ్యాహ్నం మోటార్ ఇంజిన్‌తో నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి రైతులు గమనించే సరికే ప్రాణాలు కోల్పోయాడు. సింహాచలానికి కుమారుడు ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి


అప్పలనరసమ్మ(ఫైల్)

సారవకోట: మండలంలోని వడ్డినవలసలో వ్యవసాయ బావిలో పడి గ్రామానికి చెందిన అప్పలనరసమ్మ మృతి చెందినట్లు ఆమె కుమారుడు కొర్రాయి సింహాచలం స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 14న బహిర్భూమికి వెళ్లిన అప్పలనరసమ్మకు సరిగ్గా చూపు లేకపోవడంతో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన వారు బావిలో మృతదేహం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి శవ పంచానామా చేసి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు. ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ నోట్ల కేసులో మరో ఇద్దరు అరెస్టు


టెక్కలి రూరల్ : ఈ ఏడాది ఏప్రిల్ 11న టెక్కలిలో ఏటీఎం సెంటర్ వద్ద సుమారు రూ.44 వేల నకిలీ నోట్లు మార్చుతుండగా పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసినట్లు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం మరిసిపేటకు చెందిన కోట రాజేష్, ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన పెద్దగండ్ల వంశీకృష్ణలను గోవాలో అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. వీరిద్దరినీ బుధవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తప్పుడు ఫిర్యాదులపై కేసులు నమోదు చేయాలి


డీఆర్‌ఓతో మాట్లాడుతున్న పలు పార్టీల నాయకులు


శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల నమోదుకు సంబంధించి ఒకే వ్యక్తి ఐదు, అంతకుమించి ఆన్‌లైన్లో నమోదు చేసుకునే రిజిస్ట్రేషన్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసే వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పలు రాజకీయ పార్టీల వినతులు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ అధికారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లను తొలగించాలంటూ వచ్చే తప్పుడు ఫిర్యాదుల విషయంలో కూడా ఒకే వ్యక్తి 5 కంటే ఎక్కువ తప్పుడు ఫిర్యాదులు చేసినట్లయితే వారిపైనా కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రొణ శంకరరావు, టీడీపీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, బీజేపీ నేత ఇప్పిలి సీతారాజు, కాంగ్రెస్ నేత డేళ్ల గోవింద మల్లిబాబు, బీఎస్పీ నేత రామారావు, సీ-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య


మైలపల్లి చందు(ఫైల్)

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి చందు (22) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. తల్లిదండ్రులు మైలపల్లి మాకమ్మ, లక్ష్మణరావులు బోట్ల వ్యాపారం నిమిత్తం బయట ప్రదేశాలకు వెళ్లారు. చందు విశాఖపట్నంలో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ అక్కడే ప్రైవేటు ఆసుపత్రిలో పార్ట్ టైం పనిచేస్తున్నాడు. ఇటీవలే గ్రామానికి వచ్చాడు. ఏం జరిగిందో గానీ బుధవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగుపొరుగు వారు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అప్పటికే పోలీసులు గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

సోంపేట: స్థానిక బిరుసువాడ కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే ఎస్సై షేక్ షరీఫ్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్‌పీలో పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

లారీని ఢీకొని యువకుడి దుర్మరణం


సంఘటన స్థలంలో మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని అల్లినగరం సమీపంలో సర్వీసు రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకి కుంచారావు (25) అనే యువకుడు మృతి చెందాడు. విశాఖపట్నం వైపు బైక్‌పై వెళుతున్న ఈ యువకుడు లారీని ఢీకొట్టాడు. టైరు కింద పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం పెద్దగంట్యాడ. శ్రీకాకుళం ఎందుకు వచ్చాడనే విషయం తెలియలేదు. వద్దులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ మార్చురీకి తరలించారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బయోమెట్రిక్ హాజరుపై ప్రత్యేక దృష్టి

- కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉదాసీనంగా వ్యవహరిస్తే డీడీఓలపై చర్యలు


బయోమెట్రిక్ హాజరు వేస్తున్న ఉద్యోగి

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరుపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే బయోమెట్రిక్ హాజరును ఉద్యోగుల జీతాలతో అనుసంధానం చేసినప్పటికీ అమలులో ఉదాసీన వైఖరి కనిపిస్తోంది. జిల్లాలో మొత్తం 24,000 మంది ఉద్యోగులు ఉన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐదువేల మంది ఉన్నారు. అలాగే సచివాలయ ఉద్యోగులు 14వేల మంది ఉన్నారు. పలు శాఖల్లో ఉద్యోగులు విధులకు హాజరు కాకుండా ప్రైవేటు పనులకు, వ్యాపారాలకు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించి, అన్ని శాఖల డీడీఓలకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం మూడు రోజులపాటు ఆలస్యంగా విధులకు హాజరైతే ఒక సీఎల్‌ను నమోదు చేస్తారు. ఇలా మూడు సీఎల్‌లు నమోదైతే ఒక ఈఎల్‌ను కోత విధిస్తారు. ఈఎల్‌లు లేకుంటే జీతంలో కోత విధిస్తారు. దీనిపై ఉదాసీనంగా వ్యవహరిస్తే డీడీఓలపై చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది.

అక్రమాలకు తావు లేకుండా..

గతంలో మాదిరిగా బయోమెట్రిక్‌లో అక్రమాలు లేకుండా ఉండేలా ప్రభుత్వం బయోమెట్రిక్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఇది వరలో వేలిముద్రలు నకిలీవి తయారు చేయించి, ఒకరికి బదులు వేరొకరు వేసేవారు. బయోమెట్రిక్‌ను సెల్‌ఫోన్‌లో కూడా నమోదు చేసుకునే సౌలభ్యం ఉండడంతో కొందరు కార్యాలయం నుంచి కాకుండా వేరే చోటు నుంచి నమోదు చేసేవారు. ఇప్పుడు అలాంటి వాటికి ఆస్కారం లేకుండా కార్యాలయం వెలుపల నుంచి హాజరును నమోదు చేస్తే, రాష్ట్ర స్థాయి వరకు తెలిసేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. రిమ్స్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు నాలుగైదు రోజుల కిందట ఒకరు అరసవల్లి నుంచి, మరొకరు వైఎస్సార్ కూడలి నుంచి హాజరు నమోదు చేసినట్లు గుర్తించి, వారికి మొదటి తప్పుగా హెచ్చరికను జారీ చేశారు. దీన్ని పరిశీలిస్తే సాఫ్ట్‌వేర్‌ను ఎంత పగడ్బందీగా రూపొందించారో తెలుసుకోవచ్చు. అలాగే కొందరూ ఉద్యోగులు ఉదయం బయోమెట్రిక్ వేసి, కార్యాలయాల నుంచి వెళ్లిపోయి, తిరిగి సాయంత్రం వచ్చి విధుల నుంచి వెళ్లిపోయినట్లు హాజరు వేసి వెళ్లిపోతుండడాన్ని తెలుసుకున్న ప్రభుత్వం, ఇక మీదట మూడు పూటలూ హాజరు వేయాలని తాజా ఉత్తర్వుల్లో ఆదేశించింది.

కఠినంగా వ్యవహరిస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు బయోమెట్రిక్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆలస్యమైనా, విధులకు హాజరు కాకుండా అయినట్లు నమోదు చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ స్వామినాయుడు, సూపరింటెండెంట్, రిమ్స్

ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యం


వైద్య శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రంలోని పేద ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తున్నామని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కరజాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, ప్రతీ ఒక్క రోగికి అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైతే ఆధునాతన వైద్యం, ఆరోగ్యశ్రీకి రిఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్పదివ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన్‌రావు, సర్పంచ్ కొంక్యాన లక్ష్మీ గోవిందరావు, పార్టీ నాయకులు యజ్జల గురుమూర్తి, ఓటుపల్లి కృష్ణ, తహసీల్దార్ ఎస్.వెంకట్రావు, ఎంపీడీవో రఘు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ పాలనలో క్రైస్తవులను విస్మరించారు'

టెక్కలి: గత టీడీపీ పాలనలో చంద్రబాబు క్రైస్తవులను పూర్తిగా విస్మరించారని, కేవలం ఓటర్లుగా చూశారే తప్ప ఒక్క సంక్షేమ కార్యక్రమం చేపట్టలేదని జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు పి.ఆన్వేష్‌బాబు, ప్రతినిధి కె.అబ్రహం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రైస్తవులను కనీసం పట్టించుకోలేదంటూ టీడీపీకి చెందిన క్రైస్తవ సెల్ విభాగం ప్రతినిధులు చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో క్రైస్తవులకు చెందాల్సిన నిధులను కొందరు బడాబాబులు దోచుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9887 మంది అర్హత కలిగిన పాస్టర్స్‌కు గౌరవ వేతనం ఇస్తున్నారని, అందులో జిల్లాలో 188 మంది పాస్టర్స్ ఉన్నారని తెలిపారు. ఎంతో మంది క్రైస్తవ కుటుంబాలకు సొంత ఇంటి స్థలాలు ఇచ్చారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో క్రైస్తవులకు ఏం చేశారో చెప్పాలన్నారు.